## క్లుప్తంగా

### ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

**దెందులూరు:** ప్రాధాన్యతా క్రమంలో నియోజకవర్గంలోని 4 మండలాల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను ఆయన స్వీకరించారు. వినతి పత్రాలు పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు సిఫార్సు చేశారు. అన్ని శాఖల అధికారులు స్పందన, ఎమ్మెల్యే కార్యాలయ వినతులపై చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు తదితరులు ఉన్నారు.

### ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు మహర్దశ



అభివృద్ధిచేసిన ఆసుపత్రి భవనం

**ఉంగుటూరు:** ఉంగుటూరులో ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రికి మహర్దశ ఏర్పడింది. గ్రామ పంచాయతీ రూ.3 లక్షలు, ఆయుష్ శాఖ ద్వారా మంజూరైన మరో రూ.4 లక్షల నిధులతో ఆస్పత్రి అభివృద్ధి పనులు చేపట్టారు. మొత్తం రూ.ఏడు లక్షల వ్యయంతో శిథిలావస్థకు చేరిన భవనం కొత్త రూపు సంతరించుకుంది. మరుగుదొడ్లు, ఇన్‌పేషంట్ల వార్డు, ఆసుపత్రి ప్రధాన భవనం ఫ్లోరింగ్‌కు పాలిష్ రాళ్లు అతికించారు. సుందరంగా సీలింగు ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన డా.లక్ష్మీసౌజన్య ప్రత్యేక శ్రద్ధతో దాత సాయం రూ. లక్షతో పంచకర్మ వైద్యాన్ని ఇక్కడ ప్రారంభించారు. ఆమె ఇక్కడ పనిచేసిన కాలంలో పంచకర్మ వైద్యానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అలవాటు పడ్డారు. ఈతరుణంలో ఆమె విజయవాడ బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇక్కడ ఈపోస్టు ఖాళీగా ఉంది. ఆయుర్వేద ఆసుపత్రికి వెంటనే వైద్యుడిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

### ఏకగ్రీవంగా మండల స్వర్ణకార సంఘం ఎన్నిక

**గణపవరం:** గణపవరం మండల స్వర్ణకార సంఘం ఎన్నికలు జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి నలగొండ రామకృష్ణ అధ్యక్షతన సోమవారం గణపవరంలో ఏకగ్రీవంగా జరిగాయి. నూతన కమిటీ అధ్యక్షుడిగా బ్రహ్మశ్రీ కొమ్మోజు అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కాళహస్తి ఉదయకుమార్, ప్రధాన కార్యదర్శిగా ముదపాక దుర్గాప్రసాద్, కార్యదర్శిగా వేముల మురళీకృష్ణ, కోశాధికారిగా వనమోజు తేజ బ్రహ్మాజీ, కార్యవర్గ సభ్యులుగా దేవరకొండ చంద్రశేఖర్, వేముల బాలశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రామకృష్ణ తెలిపారు.

### నేడు మహిళా సమాఖ్య జిల్లా ప్రథమ మహాసభ

**ఏలూరు (టూటౌన్):** ఈ నెల 14న జంగారెడ్డిగూడెంలో నిర్వహించే మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని ఏలూరు నగర అధ్యక్ష,కార్యదర్శులు కొండేటి బేబి, అడ్డగర్ల లక్ష్మీ ఇందిర కోరారు. జంగారెడ్డిగూడెంలోని చిట్టూరి గణేశ్వరరావు టౌన్ హాలులో ఏలూరు జిల్లా ప్రథమ మహాసభను నిర్వహిరచనున్నట్లు వారు తెలిపారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో సోమవారం నిర్వహించిన నగర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ నెల 17 నుంచి నంద్యాలలో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర 15వ మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల లోక్‌సభలో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని 2029 తర్వాత అమలు చేస్తామని చెప్పడం మహిళలను మోసగించడమే అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలోపే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఈ నెల 17,18,19 తేదీల్లో నంద్యాల్లో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు గొర్లి స్వాతి, నగర సహాయ కార్యదర్శి కొల్లూరు సుధారాణి, మావూరి విజయ, మన్నవ యామిని తదితరులు పాల్గొన్నారు.

### 22న దుర్గమ్మ ఆలయం వద్ద చీరల వేలం

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** స్థానిక పత్తేబాద నాలుగు గుళ్ళ సెంటర్లో వేంచేసియున్న కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను వేలం వేయనున్నట్లు కార్యనిర్వహణాధికారి డీ. శంకర రావు తెలిపారు. ఈ నెల 22వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు వేలం కార్యక్రమం ప్రారంభమతుందని, ఈ బహిరంగ వేలంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన దీపికలు



**భీమడోలు:** గుండుగొలనులో చిన్నారులు, పెద్దలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న గ్రంథాలయ సిబ్బంది



**భీమడోలు:** పూళ్లలో గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ తదితరులు



**పెదపాడు:** శాఖా గ్రంథాలయంలో గోడపత్రికలు కరపత్రాలు విడుదల చేస్తున్న సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్

**భీమడోలు:** విజ్ఞాన దీపికలైన గ్రంథాలయాల్లో వారోత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవం సందర్భంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 14వ తేదీ మంగళవారం నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేలా గ్రంథాలయ శాఖ సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేసారు. ప్రతి రోజు గ్రంథాలయాల్లో జరిగే కార్యక్రమాలపై రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు రోజు వారీ కార్యక్రమాలపై మార్గదర్శకాలను విడుదల చేసారు. వారోత్సవాలు అంబరాన్నింటేలా విద్యార్థులు, యువతలు, మహిళల్లో పుస్తక పఠనాన్ని అలవర్చుకునేలా వారిని చైతన్యపర్చేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రంథాలయాల్లోని అభివృద్ధి కమిటీ, రీడర్స్‌ఫోరం సహాయ సహకారాలతో చిన్నారులు, యువకులు, పెద్దలతో కలిసి అవగాహన ర్యాలీ, ప్రదర్శనలు చేసారు. ఈనెల 14న జాతీయ గ్రంథాలయ వారోత్సాలు ప్రారంభం, బాలల దినోత్సవం, 15న మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16న డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరు నాగభూషణలను స్మరించుకోవడం, 17న కవి సమ్మేళనం, సెమినార్లు, రచయితల సందేశాలు, విద్యావేత్తల సహకారంతో చర్చాగోష్టి, 18న వివిధ రకాల పోటీలు, 19న దిశాచట్టం, మహిళా సాధికారత చర్చ, మహిళలకు పోటీలు నిర్వహణ, 20న చదవడం మాకిష్టం, డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన తదితర అంశాలపై అవగాహన, బహుమతులను అందించడం కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో ఏడు శాఖా గ్రంథాలయాల్లో ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసారు.

**వారోత్సవాలకు ఏర్పాట్లు**

**భీమడోలు:** భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఈనెల 14వ తేదీ మంగళవారం నుంచి 20వ తేదీ సోమవారం వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలును ఘనంగా నిర్వహిస్తున్నామని గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎన్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణిలు సోమవారం తెలిపారు. పూళ్లలో వారోత్సవాల గోడ పత్రికలను సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ ఆవిష్కరించారు. భీమడోలు శాఖా గ్రంథాలయాల్లో చిన్నారులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ చిన్నారులను కోరారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తారు. జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తారని గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ తెలిపారు.

**కరపత్రాల విడుదల**

**పెదపాడు:** స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న సందర్భంగా గోడ పత్రికలు, కరపత్రాలను పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ చేతుల మీదుగా విడుదల చేసారు. ఈ వారోత్సవాల్లో పాఠకులు, సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు, కవులు, కళాకారులు సాహిత్యాభిమానులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు దుగ్గిపోగు జాన్ బాబు, ఆరవల్లి రంగరావు పాల్గొన్నారు.

**నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు**

**దెందులూరు:** మండలంలో మంగళవారం నుంచి ఈనెల 20 వరకూ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయని దెందులూరు గ్రంథాలయ అధికారి ఝాన్సీ, పోతునూరు గ్రంథాలయ అధికారి రాంబాబు తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. గ్రంథాలయ శాఖ రూపొందించిన వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారులు అన్నారు. విద్యార్థులు, గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**గ్రంథాలయాలను వినియోగించుకోవాలి**

**గణపవరం:** ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకోవా లని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ ఇందుకూరి రామకృష్ణంరాజు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం గణపవరం మండలం పిప్పరలో శాఖా గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. గ్రంథపాలకుడు పి.రంగారావు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

**నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు**

**పెదవేగి:** 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పెదవేగి గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ చెప్పారు. పెదవేగి గ్రంథాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ మంగళవారం నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు ఘనంగా జరుగుతాయని అన్నారు. ప్రారంభ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తాతా సూరిబాబు పాల్గొంటారని ఆయన తెలియజేశారు.

## నేడు పలు గ్రామాల్లో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'

**దెందులూరు:** కొవ్వలి గ్రామంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించనున్నట్టు దెందులూరు ఏఎంసీ వైఎస్ చైర్మన్ కాటి సుధాకర్, సర్పంచ్ ఇంతేటి మధులత తెలిపారు. వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ముఖ్య అతిథులుగా పాల్గొంటారని సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, ఎంపీటీసీ వరిపర్తి రంగారావు తెలిపారు. అతిథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నాలుగన్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి పథకాలు వివరిస్తారని తెలిపారు.

**నేడు నిడమర్రులో..**

**నిడమర్రు:** నిడమర్రు గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి' అనే కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

**నేడు గుండుగొలనులో..**

**భీమడోలు:** గుండుగొలను సచివాలయం-1 పరిధిలో ఈనెల 14న మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ భీమడోలు మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆవిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని వారు కోరారు.

# ఘనంగా దీపావళి



దీపావళి వేడుకలో జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ



బాణసంచా కాలుస్తూ సందడి చేస్తున్న యువత

**పెదపాడు:** విజయానికి చిహ్నంగా నిర్వహించే దీపావళి సంబరాలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ఆనందోత్సవాల నడుమ నిర్వహించారు. ప్రతి ఇంటా వరుసగా దీపాలను వెలిగించారు. తొలుల ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నా, పెద్దా అందరూ టపాసులు కాల్చారు. ప్రతి ఇల్లు ఆనందాల హరివిల్లుగా మారింది. సత్యవోలు గ్రామంలో జెడ్పీ చైర్ పర్సన్ తమ కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకలు నిర్వహించారు. ఇంటి ముందు దీపాలను వెలిగించి, అనంతరం బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ భర్త బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

**ఆనందోత్సాహాలతో దీపావళి పండుగ**

పెదవేగి : తెలుగు లోగిళ్లల్లో దీపాల కాంతులు, యువత, చిన్నారుల కేరింతల నడుమ ఆదివారం దీపావళి మెరుపులు వాడవాడలా మిన్నంటాయి.



ఆకాశ దీపాలను గాల్లోకి వదులుతున్న ప్రజలు

దీపావళిని పురస్కరించుకుని గృహిణులు ఇళ్ల ముంగిళ్లలో ముగ్గులు వేసి ప్రమిదలు వెలిగించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. దుకాణాల దగ్గర భారీ స్థాయిలో కొనుగోలు చేసిన బాణసంచాలను వీధుల్లో చిన్నా,పెద్దా తేడా లేకుండా కాల్చుతూ సందడి చేశారు.

## కార్తీక మాసోత్సవాలకు శివాలయాల్లో ఏర్పాట్లు



బువ్వనపల్లి ఉమా మార్కేండేశ్వరస్వామి ఆలయంలో ఆకాశ దీపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



విద్యుత్ దీపాలంకరణలో మండలపర్రు ఉమానీలకంఠేశ్వర పంచాయతన క్షేత్రం

**నిడమర్రు:** కార్తీక మాసం సందర్భంగా సోమవారం నుంచి శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. బువ్వనపల్లి ఉమా మార్కేండేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాన్ని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభించారు. కార్తీక పూజలను పురస్కరించుకుని విద్యుత్ అలంకరణలో మండలపర్రు శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బువ్వనపల్లిలో జరిగిన ఆకాశ దీప కార్యక్రమం సందర్భంగా ఆలయ అర్చకులు రుద్రపాక శివ శ్రీను శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అలుమోలు అంతర్వేది, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, ఉప్పల కాశి, పెరుకుల భీమేష్, వలపు జగదీష్ పాల్గొన్నారు.

## నేడు వెల్లమిల్లిలో 'గడపగడపకు'

**ఉంగుటూరు:** ఉంగుటూరు మండలం చిన్న వెల్లమిల్లిలో నేడు (మంగళవారం) సాయంత్రం 5గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం 213వ రోజు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మరడమంగరావు తెలిపారు. చేబ్రోలు సచివాలయ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తున్నట్లు మంగరావు తెలిపారు. పార్టీ జెండా ఆవిష్కరణ , గ్రామంలో జరిగిన అభివృద్ధి వివరాలతో కూడిన ఫ్లెక్సీ బోర్డు ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికార్లు పాల్గొనాలని మంగరావు కోరారు.

## నేడు అవగాహన సమావేశం

**ఉంగుటూరు:** కలెక్టరు ఉత్తర్వులు మేరకు ఈనెల 14న ఉంగుటూరు మండల కొల్లేరు అభయారణ్యం సున్నిత పర్యావరణ ప్రాంత ఏర్పాట్లపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించనున్నట్టు తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. కొల్లేరు పరివాహక ప్రాంతంలో కై కరం శివారు రామన్నగూడెం, వెంకట కృష్ణాపురం,బ్రహ్మనందపురం, లంకమాలపల్లి, అప్పారావుపేట తల్లాపురంలో అవగాహన సమావేశం 14వ తేదీ ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీడీవో సమావేశం మందిరంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి వన్యప్రాణి యాజమాన్య అధికార్లు డివిజన్ శాఖ అధికారి ఎస్ రవిశంకర్, ఇతర అధికార్లు పాల్గొంటారని తహసీల్దారు తెలిపారు.

## దళితుల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత



సీతంపేటలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు

**దెందులూరు:** సీతంపేటలో సురక్షిత తాగునీటి సరఫరా స్థానికులకు అసౌకర్యం కలగరాదని రూ.5.5 లక్షలతో నూతన ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రారంభించామని వైఎస్సార్ సీపీ దెందులూరు మండలాధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నట్టా లీలా నవకాంతం అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సహాయ సహకారాలతో రూ.5.5 లక్షలతో నిర్మించిన నూతన ఆర్వో ప్లాంట్‌ను సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య బాబి, ఎంపీటీసీ పులవర్తి వరమణి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు రాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితుల అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు రాజేష్, రాజు, జిల్లా కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తా



రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడిని పరామర్శిస్తున్న అబ్బయ్యచౌదరి

పెదవేగి : ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తానని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న వారిని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శించి భరోసా కల్పించారు. సోమవారం రాత్రి పెదవేగి మండలం లక్ష్మీపురంలో స్థానిక నాయకులతో కలిసి పర్యటించిన ఆయన వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న వారిని పరామర్శించి, ఆర్థికంగా అండగా నిలిచారు. గ్రామానికి చెందిన యర్రా భాస్కరరావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరిస్థితులను గమనించి ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న లక్ష్మీపురం గ్రామానికి యర్రా కిషోర్ కుమారుడిని ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం గ్రామంలో ఇటీవల మరణించిన బొడ్డు వెంకటేశ్వరరావు ఇంటి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ నాయకులు ఘంటా ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, చోడిశెట్టి వెంకటన్న, మేకా వసంత్, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## 15న విజయవాడలో సీపీఎం బహిరంగ సభ

**ఏలూరు (టూటౌన్):** ఈ నెల 15న సీపీఎం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే భారీ ప్రదర్శన, బహిరంగ సభల్లో జిల్లాలోని చేతివృత్తిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా సంఘం జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో-కన్వీనర్ ఆగొల్లు వెంకటకృష్ణారావు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజాప్రణాళిక అమలు కోసం చలో విజయవాడ ప్రజారక్షణ భేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బహిరంగ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, ఎస్.పుణ్యవతి, సీహెచ్ బాబూరావు, కె.ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలియజేసారు. సభను జయప్రదం చేయాలని ఆదిశేషు, కృష్ణారావు కోరారు.

## నేడు సకల కొత్తపల్లిలో 'పల్లెకు పోదాం'

**పెదపాడు:** మండలంలోని సకల కొత్తపల్లిలో పల్లెకు పోదాం కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సూర్యకుమార్ తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు పాల్గొనాలని ఎంపీడీవో తెలిపారు.



# తహసీల్దార్‌కు చింతమనేని బహిరంగ క్షమాపణ చెప్పాలి



జిల్లా పరిషత్ అతిథిగృహంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు

పెదవేగి : పెదవేగి తహసీల్దార్ నల్లమిల్లి నాగరాజుపై దుర్భాషలాడిన మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని దెందులూరు నియోజకవర్గ దళిత ప్రజాప్రతినిధుల డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పరిషత్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దళిత ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ చింతమనేని ప్రభాకర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు మాట్లాడుతూ చింతమనేని రాజకీయాల్లో కొచ్చిన నాటి నుంచి చింతమనేనికి దళితులు అంటే చిన్న చూపని, అహంకారంతోనే దళిత అధికారులపై, ప్రజాప్రతినిధులపై నోరు పారేసుకుంటారని మండిపడ్డారు. తహసీల్దార్ నాగరాజు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సక్రమంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ కొంతమంది మాజీ రాజకీయ నాయకులు తమ అనుచరులకు అనుకూలంగా పనిచేయడం లేదనే ఉద్దేశ్యంతో దళితుడనే చులకన భావంతో ఆయనపై, ఆయన కుటుంబ సభ్యులను అభ్యంతరకరంగా దుర్భాషలాడారని అన్నారు. అనంతరం దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం మాట్లాడుతూ చింతమనేని ప్రభాకర్‌ని అరెస్ట్ చేయాలని, దళిత సంఘాలను కలుపుకుని చింతమనేనికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. చింతమనేని క్షమాపణ చెప్పని పక్షంలో దళిత సంఘాలతో కలిసి ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు మండల నాయకులు తేరా ఆనంద్, పత్యాల సునీత, మద్దాల పండు, ఇతర దళిత నాయకులు పాల్గొన్నారు.

**తహసీల్దార్‌పై దౌర్జన్యం దారుణం**

**దెందులూరు:** మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ తహసీల్దార్‌పై మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దౌర్జన్యం చేసి, అసభ్య పదజాలంతో దూషించడం క్షమార్హం కాదని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ దెందులూరు జెడ్పీటీసీ నిట్టాలీలా నవకాంతం ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జోగన్నపాలెంలో ఆమె మాట్లాడుతూ దళితుడైన తహసీల్దార్‌పై చింతమనేని దౌర్జన్యాన్ని దళిత సంఘాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయని అన్నారు. దళితుల జేఏసీ నియోజకవర్గ జిల్లా, రాష్ట్ర స్థాయిలో చింతమనేని వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని పెదవేగి తహసీల్దార్‌కు మద్దతునిస్తున్నాయని తెలిపారు. ప్రభాకర్‌ను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాలు కోరుతున్నాయని, పెదవేగి తహసీల్దార్‌కు మద్దతుగా ఆయనకు న్యాయం జరిగేంత వరకూ దళిత సంఘాలు అండగా ఉంటామన్నారు.